అధ్వానంగా రహదారులు


అధ్వానంగా ఉన్న శృంగవృక్షం పంచాయతీ రోడ్డు


పెన్నాడ పంచాయతీ నుంచి గొరగనమూడి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలా..

పాలకోడేరు: మండలంలోని సుమారు అన్ని గ్రామ పంచాయతీలలో అనుసంధానమైన రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని మేజర్ పంచాయతీలకు ఆదాయ వనరులు ఉన్నప్పటికీ అటు పాలకవర్గం గానీ ఇటు అధికార యంత్రాంగం కాని పట్టించుకోవడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురియడంతో గ్రామాల్లోని ప్రధాన రహదారులు గుంతలు ఏర్పడి నడవడానికి వీలు లేకుండా ఉన్నాయి. ఇక వాహనాలపై వెళ్లే వారి తిప్పలు చెప్పనవసరం లేదు. మండలంలోని మేజర్ పంచాయతీ అయిన శృంగవృక్షం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నప్పటికీ పంచాయతీ ఎదురుగా ఉన్న రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం పంచాయతీ ఆఫీస్‌కు వస్తూ పోతూనే ఉంటారు. కొన్ని సందర్భాల్లో వృద్ధులు, వికలాంగులు ఆ రోడ్డుపై గుంతల్లో పడిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే పెన్నాడ పంచాయతీ కార్యాలయం నుంచి గొరగనమూడి వెళ్లే రహదారి మరీ అధ్వానంగా ఉంది. అయినప్పటికీ ఆ రహదారిని పట్టించుకునే నాథుడే లేకపోయాడు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కనీసం పంచాయతీకి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా తాడేపల్లిగూడెం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా చోడగం వెంకటేశ్వరరావును నియమించారు. తాడేపల్లిగూడెం నుంచి బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

30న ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వీకేజీ ప్రసూన చెప్పారు. బజాజ్ క్యాపిటల్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఏపీఏసీ ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం నిర్వహించే డ్రైవ్‌లో టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగులు హాజరుకావచ్చునని ప్రసూన తెలిపారు. డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్స్, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని కోరారు. ఇతర వివరాల కోసం 94418 41622 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కార్మిక నాయకుడి మృతి

ఉండి: ఆర్‌అండ్‌బీ వర్క్ ఛార్జెడ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్‌హెచ్ సన్యాసిరావు (90) శుక్రవారం ఆయన స్వగ్రామం యండగండిలో కన్ను మూశారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ స్కూల్ విద్యార్థులు నియోజవర్గస్థాయి నుంచి జిల్లా స్థాయి ఎంపికయ్యారని ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్‌లు తెలిపారు. అండర్-14, అండర్ -17 వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రాజేష్, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కొవ్వూరి లక్ష్మణ రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. వారికి నిరంతరం శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, పోసియ్యలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూలు విద్యాకమిటీ సభ్యులు కళింగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తాడేపల్లిగూడెం: ఆలయాల భద్రత విషయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ డి.విశ్వనాథం కోరారు. శుక్రవారం పట్టణంలోని మాగంటి ఫంక్షన్ హాల్‌లో దేవాలయాల ధర్మకర్తలు, కమిటీ సభ్యులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసు శాఖ ఎప్పుడూ సాయం అందజేస్తుందని, పోలీసుల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో గూడెం, తణుకు సీఐలు ఏ.సుబ్రహ్మణ్యం, ఎన్.కొండయ్యలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామారావుపేటలోని గణేష్ యూత్ ఆధ్వర్యంలో 23వ గణపతి నవరాత్రులు ఉత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. 4 వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు, రుద్రా వినయ్, తాళ్ళ సూరిబాబు, రుద్రా గణేష్, మురళీ, శివ, జ్యోతి స్వరూప్, రుద్ర గిరి, రమేష్ నాయుడు, ప్రభాకర్, ప్రసాద్, జగన్నాథం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏసీ కమిషనర్ మురళీకృష్ణకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ ఎఫ్ఏసీ కమిషనర్‌గా పనిచేసిన ఎంఈ మురళీకృష్ణ బదిలీపై విశాఖపట్నం వెళ్తున్న సందర్భంగా శుక్రవారం పతాంజలి యోగాలయంలో వీడ్కోలు అభినందన సభ జరిగింది. మురళీకృష్ణ పతాంజలి యోగాలయంలో సభ్యుడిగా ఉండటంతో యోగాలయంలో ఆయనకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు వింజమూరి మాధవరావు, మాకా శ్రీనివాసరావు, గ్రంధి సత్యనారాయణ, కడియాల పరశురాం, కుంట్ల మోహన్‌రావు ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువపై బ్రిడ్జి నిర్మించాలి

తాడేపల్లిగూడెం రూరల్: కంసాలిపాలెం - మాధవరం గ్రామాల మధ్య ఎర్ర కాలువ బ్రిడ్జిని నిర్మించాలని, ఎర్ర కాలువ గట్లను పటిష్టం చేయాలని సీపీఎం మాధవరం గ్రామ శాఖ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభ గోపాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ గత మూడేళ్లలో కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టి చర్చించారు. భవిష్యత్ కార్యక్రమాలు విజయవంతానికి కృషి చేయాలన్నారు. అనంతరం సీపీఎం మండల నూతన కార్యదర్శిగా పురిటిగడ్డ జయమ్మ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నిచ్చెనకోళ్ళ రాముడు, మల్లుల పరమేశు, వయ్యేరి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో దంచికొట్టిన వాన

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, గొల్లవానితిప్ప, గూట్లపాడు, తుందుర్రు, వెంప, చినఅమిరం, రాయలం, అనాకోడేరు,కొమరాడ, నాగిడిపాలెం, తోకతిప్ప, దెయ్యాలతిప్ప, దొంగపిండి, లోసరి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో పలువురు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్లపు గ్రామాలైన దొంగపిండి, లోసరి, కొత్తపూసలమర్రు, గూట్లపాడు, తోకతిప్ప, నాగిడిపాలెం తదితర గ్రామాలలోని శివారు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఈ వర్షం వల్ల దుబ్బు దశలో ఉన్న వరిచేలకు తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రొయ్యలు, చేపలు చెరువుల్లో పీహెచ్ శాతాల్లో హెచ్చుతగ్గులు ఏర్పడి మేతలు మందగిస్తాయని ఆక్వా రైతులు చెబుతున్నారు.

వరద బాధితులకు సహాయం

ఆకివీడు: స్థానిక సమతానగర్‌లోని వరద బాధితులకు విజయవాడకు చెందిన డాన్ బోస్కో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.తంబిజోసఫ్, అల్ఫాన్సరాజు, టి.లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

డిజీ లాకర్‌పై అవగాహన సదస్సు

ఆకివీడు: కంప్యూటర్‌లో ధ్రువ పత్రాలను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా డిజీ లాకర్ విధానాన్ని సృష్టించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిజీ లాకర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారానే ధ్రువ పత్రాలు మంజూరు అవుతాయన్నారు. నూతన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుజేస్తుందన్నారు. ఇలా భద్రపరుచుకన్న వాటిని అవసరం మేరకు జిరాక్స్‌లు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


డిజీ లాకర్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

విజ్ఞానాన్ని అందించే పర్యాటకం

పర్యాటకం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని, కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. కళాశాల ఆవరణలో శుక్రవారం పర్యాటక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ. కోటి విరాళం

భీమవరం: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి భీమవరం పట్టణానికి చెందిన సాగర్ గ్రంధి ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ తరఫున గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావు రూ. కోటి విరాళం అందించారు. శుక్రవారం అమరావతిలోని సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించారు. గూడూరు ఎమ్మెల్యే అనిల్, మాజీ ఎమ్మెల్సీ బీరా రవిచంద్రన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

భీమవరం: వరద బాధితుల సహాయార్థం శుక్రవారం భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబుకు పలువురు దాతలు విరాళాలు అందచేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణానికిచెందిన భూపతిరాజు వెంకటరామ రాజు రూ.లక్ష, భీమవరం క్యాన్వర్సింగ్ అసోసియేషన్ రూ.58 వేలు, భీమవరం మండలం అనాకోడేరు గ్రామ ప్రజలు సుమారు రూ 3 లక్షలు, పెదగరువు గ్రామ ప్రజలు రూ. లక్ష విరాళాన్ని అందించారు.

అండర్ పాస్ వంతెన నిర్మించాలి

ఆకివీడు: స్థానిక 14వ వార్డులోని జవహర్‌పేటలో రైల్వే ట్రాక్‌కు అండర్ పాస్ వంతెన నిర్మించాలని సీపీఎం డిమాండ్ చేసింది. వార్డులో శుక్రవారం పార్టీ వార్డు మహాసభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజులకు నివాళులర్పించారు. సభలో పట్టణ కమిటీ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ ప్రజా అవసరాల్ని పెడచెవిన పెట్టి, పాలకులు పెత్తందార్ల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఆక్రమణల తొలగింపులో పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు బ్రతకలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల్ని మభ్యపెట్టేవిధంగా సంక్షేమ పథకాల్ని ప్రకటించి, అమలులో చిత్తశుద్ధి వహించడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని నాయకులు డోకల లక్ష్మి, ఎస్కే వల్లీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీవీ వర్మ, సందక సూరిబాబు, జి.రాంబాబు, లావణ్య,రాణి, రాము, సందక ఉదయ కుమారి, ఎర్రా కృష్ణవేణి పాల్గొన్నారు.


సీపీఎం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం: స్థానిక మెంటేవారి తోటలోని శ్రీ విజయ కనకదుర్గ, శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 10 రోజుల నిర్వహించే దేవి శరన్నవరాత్రి మహోత్సవ బ్రోచర్, పుస్తకాలను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 3న అమ్మవారిని బాల త్రిపురసుందరీ దేవి, 4న గాయత్రి దేవి, 5న అన్నపూర్ణ దేవి, 6న లలితా త్రిపుర సుందరీ దేవి, 7న మహాచండీ, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతి దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధని, 12న రాజరాజేశ్వరి దేవి అలంకరణ చేస్తామని పేర్కొన్నారు. 14న గ్రామోత్సవం, 17న అన్న సమారాధన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్, కమిటీ సభ్యులు మద్దాల సత్యనారాయణ, నైనాలశెట్టి లీల, సమతం తాతాజీ తదితరులు పాల్గొన్నారు.


నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్

30న కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

భీమవరం: పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యాలు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తు ఈ నెల 30న భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ధర్నా నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఖాతాదారులు భయపడొద్దు

ఉండి: కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ ఖాతాదారులు, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్యాంకు రూ.7 కోట్ల నిల్వలో ఉందని బ్యాంక్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి పి.ఆనందరాజు తెలిపారు. శుక్రవారం బ్యాంకులో ఖాతాదారులు, రైతులతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంక్ మాజీ చైర్మన్ కనకరాజు సూరి మాట్లాడుతూ బ్యాంకు ప్రక్షాళన కార్యక్రమాలు వేగంగా నిర్వమిస్తున్నామని తెలిపారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లేందుకు సుముఖంగా ఉన్నారని వారికి నోటీసులు పంపించామన్నారు. డిపాజిట్‌దారులకు చిన్న ఇబ్బంది కూడా లేకుండా లావాదేవీలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మాజీ అధ్యక్షుడు పేరిచెర్ల సూర్యనారాయణరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, కార్యదర్శి బగాది శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


ఖాతాదారులతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

కార్యకర్తలకు అండగా ఉంటా

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆంధ్రప్రదేశ్ ఆక్వా డెవలప్‌మెంట్ కల్చర్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేడర్‌కు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ చుంద్రు తేజస్విని, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, బుర్ల సుబ్బలక్ష్మి, మాజీ ఎమ్పీటీసీ బుర్ల కట్లయ్య, నాయకులు మాకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్పిడి మురళీ, మాకరాజు సతీష్, కొండుబోయిన కృపావరం, మాకిరెడ్డి నెహ్రూ, నల్లమిల్లి అంజిరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అప్సడా మాజీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు

సర్పంచ్ రాజారావుకు పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామ సర్పంచ్ పిచ్చుకల రాజారావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను శుక్రవారం అక్వా డవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు పరామర్శించారు. రాజారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చిన్నం సురేష్, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ ఉర్ల నవీన్, నాయకులు అంజిరెడ్డి, పుల్లయ్య తదితరులు ఉన్నారు.


జట్లపాలెం గ్రామంలో కట్టుబోయిన కృష్ణప్రసాద్ దంపతులను కలిసిన వడ్డి రఘురాం

జట్లపాలెం వైఎస్సార్ సీపీ నాయకులను కలుసుకొన్న వడ్డి రఘురాం

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం గ్రామంలో ఏపీ మాజీ అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి మాజీ అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ కట్టుబోయిన భాస్కరరావులను ఆయన కలిసారు. ఈ కార్యక్రమంలో గొన్నూరి గంగరాజు, గుమ్మళ్ల రత్నరాజు, కునుకు పుల్లయ్య, గ్రామ ఎస్సీపేట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి

పెంటపాడు: సీజనల్ వ్యాధులతో పాటు, మాతా శిశుసంరక్షణ పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముదునూరు ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ తెలిపారు. ముదునూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సబ్‌సెంటర్‌ల సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలరోజుల నుంచి సబ్‌సెంటర్‌లో ప్రజల ఆరోగ్యంపై తీసుకొన్న చర్యలు, మందుల వినియోగం, మాతా శిశువుల ఆరోగ్యం తదితర విషయాలపై చర్చించి సమీక్షించారు. సూపర్‌వైజర్ మోహనరావు, హెచ్‌వీ మెర్సీలు మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రైడే కార్యక్రమాలు, నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల లార్వా ప్రబలకుండా పంచాయతీ సిబ్బందితో కలిసి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీకాల రిజిస్ట్రేషన్, ఓపీ వివరాలు, యాప్‌ల నిర్వహణ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రెడ్డిబాబు రమణ, పూజ్యం శ్రీనివాస్, శేఖర్, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ

డ్రెయినేజీలను డస్ట్‌బిన్‌గా వాడొద్దు

తణుకు అర్బన్: డ్రెయినేజీలను డస్ట్ బిన్‌గా వాడరాదని నీటి పారుదలకు ఆటంకం కలగనివ్వరాదని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని జంగం చెర్వు, జయంతి కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. దోమ పుట్టుకను నివారించగలిగితే వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. చిన్నపాటి నీటి నిల్వలు, నిరుపయోగ సామాగ్రి దోమలకు ఆవాసాలని స్పష్టం చేశారు. ఇంటి ఆవరణల్లో అవసరం లేని నీటినిల్వలను తొలగింపచేయాలని, రిఫ్రిజిరేటర్లు, కూలర్స్, మొక్కల కుండీలను వారానికోసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకు గాలి గొట్టాలకు నైలాన్ వైర్ మెష్‌తో చుట్టి ఉంచాలని చెప్పారు. ఈ సందర్భంగా వ్యాధులపైనా, పరిసరాల పరిశుభ్రతపైనా అవగాహన కలిగేలా కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు కే బేబీ కుమారి, ఎన్.భానుశ్రీ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్త ఇ.లలిత పాల్గొన్నారు.


తణుకులో వ్యాధుల నివారణపై అవగాహన కల్పించే విధంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలకు మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బీబీ శుక్రవారం తెలిపారు. షాట్‌పుట్, డిస్కస్ త్రో, వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవో వి.హనుమ, పీఈటీ ఎ.నాగార్జునరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. జగన్నాథపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బాలబాలికలు అండర్-14, 17 కబడ్డీ, ఖోఖో విభాగాల్లో ఎంపికైనట్లు వివరించారు. కబడ్డీ అండర్-17 బాలబాలికల విభాగంలో ఎం.లోకేష్, యు.దుర్గావీనిత, పి.గణశ్రీహరిణి, సీహెచ్.అదితి, ఖోఖో అండర్-14 బాలికల విభాగంలో ఎస్.షణ్ముఖ ప్రియ హర్షిణి, జి.సాయిఅపర్ణ, జి.నాగలక్ష్మి, అండర్-17 బాలికల విభాగంలో యు.దుర్గాలిఖిత, పి.గణశ్రీ హరిణి, సీహెచ్.అనిత, అండర్-17 బాలుర విభాగంలో వీరేష్, జి.సురేష్, టి.సత్యనారాయణమూర్తిలు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ చంద్రిక, ఎమ్పీటీసీ నాగులు, ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, విద్యాకమిటి చైర్మన్ అరిగెల వెంకటకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు కే. వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైన పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

ప్రత్యేక పూజల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలి

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న పూజల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్డు హరిబాబు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలన్నారు. ఎమ్పీటీసీ ప్రత్తి రంగ, ప్రత్తి బాబి, శివాలయ కమిటి మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి దొరబాబు, మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు బండారు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు

నేడు కారుమూరి ప్రత్యేక పూజలు

తణుకు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10గంటలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. ఈ పూజాధికాల్లో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పార్టీ శ్రేణులు పాల్గొంటారని వివరించారు.